ఈ రోజు జరిగిన కా॥ పుచ్చలపల్లి సుందరయ్య గారి వర్ధంతి కార్యక్రమం నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము – జె.జయరాం.

**తేది : 19 మే, 2023.**

**నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం**
**కార్మిక – కర్షక ఐక్యతతో బలమైన ఉద్యమాల నిర్మాణం**
**కా॥ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలో**
**సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**

కా॥ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమం సిపిఐ(ఎం) రాష్ట్రకార్యాలయంలో శుక్రవారంనాడు జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఈ తరానికి మార్గదర్శి అని కొనియాడారు. రాజకీయ వేత్తలు, రాజకీయాలు ఎలా ఉండాలో నిలువెత్తు నిదర్శనంగా సుందరయ్య గారు నిలుస్తారన్నారు.

నూతన ఆర్థిక విధానాలు వచ్చిన తరువాత ఎన్నికలు, రాజకీయాలు కూడా వ్యాపారీకరణ జరిగిన దశలో మనం ఉన్నామని తెలిపారు. ఎన్నికలు, రాజకీయాలు అంటే పదవులు, డబ్బు అనేలా మారిపోయిందని, అన్ని రంగాలకంటే ఎక్కువ లాభదాయకమైన కార్పొరేట్ బిజినెస్ మోడల్‌గా రాజకీయాల్ని మార్చేశారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తుల్ని, ప్రభుత్వ రంగాన్ని ఇష్టమొచ్చినట్టు దోచుకోవడానికి వాడుకుంటున్నారన్నారు. ఇలాంటి దశలో వేగుచుక్కలా కమ్యూనిస్టు పార్టీలే రాజకీయ విలువల్ని కాపాడుతున్నాయని తెలిపారు. పార్లమెంటు రాజకీయాల్లో ఎంపి, ఎమ్మెల్యే స్థానాలు లేకున్నా రాజకీయ విలువలను నిలబెట్టడానికి, వాటిని నేటి యువతరానికి అందించడానికి కా॥ సుందరయ్య ఆనాడు వేసిన పునాది నేటికీ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. సొంత జీవితంలో నిజాయితీ, ఆదర్శనీయమైన రాజకీయాలను పాటించడమే కాకుండా సమాజాన్ని మార్చే విప్లవ రాజకీయ విధానాన్ని, ఉన్నతమైన వ్యూహాన్ని అందించారని ప్రశంసించారు.

కార్మిక కర్షక ఐక్యతతో రాజకీయ అధికారం నుండి పెట్టుబడిదారీ వర్గాన్ని కూలదోసి సోషలిజాన్ని నిర్మిస్తేనే మానవులకు విముక్తి లభిస్తుందని కా॥ సుందరయ్య నమ్మారని అందుకోసమే యావజ్జీవితం పోరాడారన్నారు. అందులో భాగంగానే జమీందారీ, తెలంగాణ సాయుధ పోరాటం, కూలి పోరాటాలు, భూపోరాటాల వంటి వాటికి నాయకత్వం వహించారు. కూలి పోరాటాలద్వారా వ్యవసాయ కార్మికులకు సంఘం ఏర్పాటు చేసి ఈ రోజు రాష్ట్రంలో బలమైన సంఘాన్ని ఏర్పరిచారన్నారు. గ్రామగ్రామాల్లో స్వయంగా తిరిగి భారతదేశ సమాజాన్ని నిర్దిష్టంగా అధ్యయనం, వర్గ విశ్లేషణ చేసి కార్మిక, కార్షక ఐక్యతను ఎలా నిర్మించాలో చూపారన్నారు. అలాంటి నాయకుడిని ఆరద్శంగా తీసుకుని బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడానికి సమాయత్తం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయన జీవిత చరిత్రను అందరూ అధ్యయనం చేయాలని కోరారు.

సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు కా॥ మధు మాట్లాడుతూ సుందరయ్యగారు చాలా చిన్నతనంలోనే దోపిడీ మీద పోరాటాన్ని ప్రారంభించారన్నారు. జగన్ ప్రభుత్వం విద్యుత్ మీటర్లు పెట్టి రైతులను నిలువు దోపిడీ చేయడానికి చూస్తున్నది. దేశంలోనే విద్యుత్‌మీటర్లు పెట్టిన మొదటి రాష్ట్రం మనదేనన్నారు. ఈ మీటర్ల పేరుతో అదానీకి కోట్లాది రూపాయలు కట్టబెడుతున్నారు. సుందరయ్య గారి స్ఫూర్తితో రైతాంగం మీద జరుగుతున్న దాడిని తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుందరయ్యగారు క్రమశిక్షణకు మారుపేరన్నారు. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేసేవారన్నారు.

సభకు కా॥ జయరాం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, బి.ఆర్.తులసీరావులు మాట్లాడారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, ఎం.సూర్యారావు, కె.ఉమామహేశ్వరరావు, కె.స్వరూపరాణి, వై.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

= = = =